

రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలూ బీజేపీవే

- ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు
- మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం
- కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

7



భీమారంలో మహిళలతో సెల్ఫీ దిగుతున్న బండి సంజయ్

రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారనున్నాయని లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానంతో పాటు రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాలనూ బీజేపీ గెలుచుకుంటుందని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో చేపట్టిన ప్రజాహిత యాత్ర ప్రారంభానికి ముందు బండి సంజయ్ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల్లో ప్రజాహిత పాదయాత్ర నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని భరోసా ఇచ్చారు.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన



జగిత్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో శనివారం ప్రవేశపెట్టిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మధ్యంతర పద్దు (ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్)పై బిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. రాష్ట్ర బడ్జెట్ కొందరిలో ఆశలను కలిగించగా, మరికొందరిని నిరాశ నిస్పృహలకు గురిచేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు రాష్ట్ర రైతాంగం, సామాన్యులు, పేదలు, ఉద్యోగులు ఇలా అన్నివర్గాల ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా బడ్జెట్ ప్రవేశ పెట్టారని కొందరు అభిప్రాయ పడుతుండగా, దశ దిశ, నిర్దేశం లేని నిష్ప్రయోజకర బడ్జెట్ అని మరికొందరు ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం పలు రంగాలను ప్రోత్సహించడం, సామాన్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను రూపొందించిందని కొందరు ఖితాబు ఇవ్వగా, కాంగ్రెస్ సర్కారు మసిపూసి మారేడు కాయ చేసిన గోల్ మాల్ బడ్జెట్ అని మరికొందరు ధ్వజమెత్తారు. శాసనసభలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జగిత్యాల జిల్లాకు చెందిన పలు వర్గాలకు చెందిన వ్యక్తులు వెల్లడించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి...

ఆశ...నిరాశలను మిగిల్చిన రాష్ట్ర బడ్జెట్

బడ్జెట్‌పై అభిప్రాయాలు వెల్లడించిన జిల్లా నేతలు

పేదల బడ్జెట్

అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, ధర్మపురి



రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రాష్ట్ర బడ్జెట్ ద్వారా అనేక రంగాలకు లబ్ధి చేకూరుతుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బల పరచడమే కాకుండా కొత్త ఆశలు, అవకాశా లను కల్పిస్తోంది. ప్రగతి శీల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మల్లు భట్టి విక్రమార్కకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు.

విద్యా రంగానికి నిధుల కేటాయింపు భేష్

తులసి ఆగమయ్య, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు



విద్యా రంగానికి రూ. 21,398 కోట్ల నిధులను కేటాయించడం శుభ పరిణా మము. తెలంగాణ ఏర్పడిన అనంతరం విద్యా రంగానికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం ఇదే ప్రథమం. ప్రతీ మండలా నికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు, ప్రతీపాఠశాలకు డిజిటల్ క్లాస్ ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించడం సంతోషదాయకము.

గోల్ మాల్ బడ్జెట్

డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల



కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ గోల్ మాల్‌గా ఉంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ అంశాల అమలుపై బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం, మాయా ప్రభుత్వమనడానికి బడ్జెట్ అద్దం పడుతోంది. సామాన్య ప్రజలను బడ్జెట్‌లో పట్టించుకోలేదు. రాష్ట్రబడ్జెట్‌పై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాం.

స్వల్పంగా పెరిగిన కేటాయింపులు

తిరుక్కోవెల శ్యామ్‌సుందర్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపులు గతం కంటే పెరగడాన్ని ఆహ్వానిస్తున్నాము. అయినప్పటికీ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా 15 శాతం నిధులు కేటాయించలేకపోయారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడం హర్షణీయం.

నిజాం షుగర్స్ పునరుద్ధరణకు కేటాయింపులు లేవు

డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్యే, కోరుట్ల



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన నిజాం షుగర్స్ పునరుద్ధరణకు అనుగుణంగా బడ్జెట్‌లో ఎలాంటి నిధుల కేటాయింపులు జరగలేదు. రైతులను, కౌలు రైతులను బడ్జెట్‌లో విస్మరించింది. రైతు సంక్షేమానికి అవసరమైన విధంగా బడ్జెట్‌ను రూపొందించలేదు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రభుత్వం ప్రయత్నించింది.

వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకాలు లేవు

అయిల్నేని సాగర్ రావు, సింగిల్ విండో చైర్మన్, పోతారం



బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అవసరమైన ప్రోత్సాహకాలను ప్రకటించలేదు. రైతాంగానికి ఉపయోగపడేలా పథకాలను ప్రకటించలేదు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుదల, పన్ను చెల్లింపులో మినహాయింపులు, పారిశ్రామిక అభివృద్ధి తదితర అంశాలపై ఆశలు పెట్టుకున్న వారి ఆశలపై నీరు చల్లే విధంగా మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉంది.

వాస్తవిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు

తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ



గత ప్రభుత్వం మాదిరిగా అబద్దాల బడ్జెట్ ను సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు ప్రవేశ పెట్టలేదు. వాస్తవిక బడ్జెట్‌ను ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టారు. బడుగు, బలహీన, మైనార్టీ, మహిళా, యువజన, విద్యార్థి తదితర వర్గాల ప్రజలకు మేలు చేకూరే విధంగా బడ్జెట్ ఉంది. రైతాంగానికి, విద్యా, వైద్యరంగాలకు తగిన ప్రాధాన్యాన్ని కల్పించారు. అన్నివర్గాల ప్రజలు హర్షించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది.

సామాన్య ప్రజలకు న్యాయం చేసేలా బడ్జెట్

తాటిపర్తి విజయలక్ష్మి, మహిళా కాంగ్రెస్ జిల్లా నాయకురాలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజలకు న్యాయం చేసేలా ఉంది. ఆర్థికంగా స్థితి మంతులు కాకుండా పేద ప్రజలను ఆదుకునేలా బడ్జెట్‌ను రూపకల్పన చేశారు. మహిళా సంక్షేమానికి సైతం నిధులు కేటాయించారు. ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాము.

విద్య, వైద్యానికి పెద్ద పీట

మహంకాళి రాజన్న, కాంగ్రెస్ నాయకుడు, జగిత్యాల



మానవుని కనీస అవసరాలైన విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేయడం శుభపరిణామం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం విద్యావైద్యానికి సరిపోయే విధంగా నిధులు కేటాయించడం హర్షణీయం.

బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యం

నునావత్ రాజు, టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యం లభించింది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా బడ్జెట్ కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడం హర్షణీయం.

నిరాశ, నిస్పృహలను కలిగించింది

మోరపల్లి సత్యనారాయణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు, జగిత్యాల



సామాన్యులను బడ్జెట్ నిరాశ, నిస్పృహలను కలిగిస్తోంది. వ్యవసాయ రంగం, గ్రామీణ అభివృద్ధి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి చేసిన ప్రయత్నం శూన్యంగా కనిపిస్తోంది. బడా పెట్టుబడిదారులను ప్రోత్సహించేలా బడ్జెట్ కనిపిస్తోంది. కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని విస్మరించడం విచారకరము.

ఇది అంకెల గారడీ బడ్జెట్

దొనికెల నవీన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



రాష్ట్ర బడ్జెట్ వల్ల సామాన్యులకు ఒరిగిందేమీలేదు. అన్ని రంగాలకు ప్రాధాన్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. వైద్యం, ప్రజారోగ్యం, మౌలిక రంగాలను అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. పేద ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదు.

గృహజ్యోతి దరఖాస్తుల వివరాలపై తనిఖీ



సిరికొండలో వివరాలు సేకరిస్తున్న జడ్పీ సీఈవో

కథలాపూర్, ఫిబ్రవరి 10: ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజల నుంచి స్వీకరించిన గృహజ్యోతి పథకం దరఖాస్తుల వివరాలను జడ్పీ సీఈవో రఘువరన్ శనివారం తనిఖీ చేశారు. సిరికొండ, కథలాపూర్, తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్న సర్వేల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల్లో సిలిండర్ కనెక్షన్ల వివరాలను సరిగా నమోదు చేయని వారి ఇళ్లకు వెళ్లి పూర్తిస్థాయి సమాచారం నమోదు చేసి నివేదికలు పంపించాలని సూచించారు. కనెక్షన్ నంబర్, ఆధార్, బ్యాంకు ఖాతాలతో అనుసంధానం వంటి వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలి

- మెట్‌పల్లి ఎంపీడీవో భీమేష్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 10: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు పకడ్బందీగా చేపడుతూ ప్రజలను భాగస్వాములను చేయాలని మెట్‌పల్లి ఎంపీడీవో భీమేష్‌రెడ్డి అధికారులకు సూచించారు. గ్రామాల స్వచ్ఛతకు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వెల్లుల్ల, బండలింగాపూర్ గ్రామాల్లో చేపట్టిన మురుగు కాల్వల శుభ్రం, నీటి నిల్వ ప్రాంతాల పూడ్చివేత, దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకుంటున్న పనులను ఆయన పరిశీలించారు. ఆత్మనగర్ గ్రామాల్లో ర్యాలీలు తీసి ప్రజలకు అవగాహన కల్పిస్తూ శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలు, వీధులు శుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.

గ్రామాల్లోని ప్రజలు ఇంట్లోని చెత్తను మురికి కాలువలుల్లో, రోడ్లపై వేయకుండా పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపాలని ప్రజలు ఇంటితో పాటు పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా అధికారులు, కార్యదర్శులు చర్యలు చేప ట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు జరుపుల శ్రీనివాస్, మాజీ ఉపస ర్పంచ్ చిలివేరి విజయ్, నాయబ్ తహసీల్దార్ రాజ్‌మహ్మద్, కార్యదర్శులు అశోక్ గౌడ్, నిజామొద్దీన్, పంచాయతీ సిబ్బంది, ఏఎన్ఎమ్ వసంత, ఆశావర్కర్ హేమ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల, రామాజీపేట గ్రామాల్లో శనివారం ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని మురికి కాలువల పూడికతీత తదితర పనులను ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు.



బండలింగాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నాలుగు రోజులగా గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలు గ్రామ ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి పనులను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని మురికి కాల్వను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. వివిధ గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో అంటువ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించే విధంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించిన గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య-రాజేష్, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు తహసీల్దార్ కిషన్, మండల వ్యవసాయ అధికారి నాగమణి, ఎంపీవో నీరజ, ఎంఈవో నరేశం, పశువైద్య మండల అధికారి డాక్టర్ దీరజ్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు, ధర్మపురిలో భక్తుల రద్దీ






అంజన్న ఆలయం ఎదుట భక్తుల సందడి, లక్ష్మీనరసింహస్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 10: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తున్న తరుణంలో క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టికెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కుబేరుడిని దర్శనం చేసుకున్నారు. రావిచెట్టు ఆంజనేయ స్వామి చుట్టు ప్రదక్షిణాలు చేశారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాల వద్ద లోక క్షేమార్థం నరసింహ హోమం జరిపారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీ రోజంతా నిరంతరంగా కొనసాగింది. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, బొజ్జపోతన పరిసరాలు నిండిపోయాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో అంజయ్య ఇతర అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.

గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి

జగిత్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రవాస భారతీయుల సంక్షేమం కోసం ఎన్ఆర్ఐ పాలసీ, గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి వినతిపత్రం అందించారు. శనివారం హైద్రాబాద్‌లోని శాసనసభ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఉత్తర తెలంగాణలో చాలా మంది నిరుద్యోగ యువత గల్ఫ్ దేశాలపై ఆధారపడి ఉన్నారన్నారు. సంబంధిత కుటుంబాల సంక్షేమానికి కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీ, గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని వివరించారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు.



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

భారీగా రెవెన్యూ అధికారుల బదిలీలు

జగిత్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మెట్‌పల్లి ఆర్డీవో మధును కొత్తగూడెం ఆర్డీవో బదిలీ చేశారు. మెట్‌పల్లి ఆర్డీవోగా సిరిసిల్ల డీఆర్డీవోగా పనిచేస్తున్న ఎన్ శ్రీనివాస్‌ను బదిలీ చేశారు. తహసీల్దార్ల బదిలీల్లో అసిఫాబాద్ జిల్లా కెరిమెరీ తహసీల్దార్ జమీర్‌ను, మంచిర్యాల జిల్లా బీమారం మండలం తహసీల్దార్ విశ్వంబర్‌ను, నిర్మల్ కలెక్టరేట్ సూపరెంటెండెంట్ శ్రీనివాస్‌ను, పెద్దపల్లి కలెక్టరేట్ సూపరెండెంట్ రాజమణిని జగిత్యాలకు కేటాయించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి తహసీల్దార్ ఎండీ ఆరీఫోద్దిన్‌ను పెద్దపల్లి, పెగడపల్లి తహసీల్దార్ ఫారూఖీని రాజన్న సిరిసిల్ల జిల్లాకు, ఎండపల్లి తహసీల్దార్ ఉదయ్‌కుమార్‌ను కొమురం భీం అసిఫాబాద్ జిల్లాకు, కలెక్టరేట్ సూపరెంటెండెంట్ రాజ మనోహర్‌రెడ్డిని మంచిర్యాల జిల్లాకు, కలెక్టరేట్ సూపరెంటెండెంట్ విజయలక్ష్మిని నిర్మల్ జిల్లాకు కేటాయించారు. అదేవిధంగా నాయబ్ తహసీల్దార్ బదిలీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి ఖాజా అబ్దుల్ మజీద్‌ను, బోధన్ నుంచి రాజశేఖర్, నిజామాబాద్ నార్త్ జోన్ నుంచి కార్తిక్ రెడ్డి, నిజామాబాద్ సౌత్ మండలం నుంచి వినోద్‌కుమార్ నాయబ్ తహసీల్దార్లను జగిత్యాల జిల్లాకు కేటాయించారు. అదేవిధంగా జిల్లాలోని జగిత్యాల మండలం నుంచి హరీశ్ కుమార్‌ను, పెగడపల్లి నుంచి విష్ణువర్ధన్‌ను, బీర్పూర్ పద్మ నాయబ్ తహసీల్దార్లను నిజామాబాద్‌కు కేటాయించారు.

విద్యార్థినికి అభినందన

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 10: శ్రీచైతన్య హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థిని ఎం.వైష్ణవి 2024 నేషనల్ సైన్స్ ఫెయిర్ కు ఎంపికైనట్లు డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కరస్పాండెంట్ క్యాతం గంగారెడ్డి, ప్రిన్సిపాల్ గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, గైడ్ నర్సయ్యలు ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

చొప్పదండి, ఫిబ్రవరి 10: చొప్పదండి నవోదయ విద్యా లయంలో 9, 11వ తరగతిలో ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది తరగతి పరీక్ష కోసం 1,745 మంది దరఖాస్తు చేసుకోగా 1,023 మంది పరీక్ష రాశారని తెలిపారు. 11వ తరగతిలో 1,144 మంది దరఖాస్తు చేసుకున్నారని, 769 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

చొప్పదండి, ఫిబ్రవరి 10: మండలంలోని రుక్మాపూర్ కస్తూర్బా పాఠశాల విద్యార్థిని పి అమూల్య రాష్ట్ర స్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక అయింది. అమూల్య రూపొందించిన ప్రొటెక్షన్ ఫ్రమ్ మ్యాన్ హోల్ అనే ఎగ్జిబిట్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేశారు. భారీ వర్షం కురిసినప్పుడు పట్టణాల్లో మ్యాన్ హోల్ ద్వారా ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో ప్రొటెక్షన్ ఫ్రమ్ మ్యాన్ హోల్ అనే పరికరాన్ని రూపొందించడంతో ఆమెను అవార్డుకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి అవార్డుకు అమూల్య ఎంపిక కావడంపై ప్రత్యేకాధికారి భార్గవి, గైడ్ టీచర్ స్వప్న ఆమెను అభినందించారు.

ఎన్‌సీడీసీ, బీఐఆర్‌డీ గవర్నింగ్

కౌన్సిల్ మెంబర్‌గా 'కొండూరు'

● వరుసగా రెండో సారి నామినేట్


కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 10: నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌సీడీసీ), బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (బీఐఆర్‌డీ) గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా కరీంనగర్ జిల్లాకు చెందిన నాఫ్‌స్కాబ్, టెస్కాబ్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు వరుసగా రెండోసారి నామినేట్ అయ్యారు. దక్షిణ భారత సహకార రంగానికి రెండోసారి నామినేట్ కావడం అరుదైన గౌరవంగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్‌షా నేతృత్వంలోని ఎన్‌సీడీసీ వివిధ రకాల రుణాలు, వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సహాయం మంజూరు చేయడానికి, దాని ఆర్థిక సామర్థ్యం పెంపొందించేందుకు ఒక ప్రధాన సంస్థకు గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా నామినేట్ అయ్యారు. మూడేళ్ల పదవీ కాలంలో ఆయన ప్రతి త్రైమాసికంలో ఒకసారి జరిగే సమావేశంలో పాలక మండలి సభ్యుడిగా పాల్గొంటారని ఉద్యోగులు పేర్కొన్నారు. నాబార్డు ప్రధాన సంస్థ అయిన బీఐఆర్‌డీ పాలకమండలి సభ్యుడిగా తిరిగి నామినేట్ అయిన కొండూరు రవీందర్‌రావు ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. గ్రామీణ సహకార రంగం, వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులందరికీ శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంచేందుకు బీఐఆర్‌డీ పనిచేస్తుందని తెలిపారు. దేశంలోనే ప్రధాన సంస్థలైన ఎన్‌సీడీసీ, బీఐఆర్‌డి సంస్థలకు గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా రవీందర్‌రావు తిరిగి నామి నేట్ కావడం తెలంగాణ రాష్ట్ర సహకార రంగానికి, కరీంనగర్ జిల్లాకు గర్వకారణమని పలు వురు ఉద్యోగులు, పాలకవర్గ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 10: అనారోగ్యంతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓగులాపూర్‌కు చెందిన రొట్టె శ్రీధర్(26)అనే యువకుడు కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కుమారస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలూ బీజేపీవే

- ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు
- మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం
- కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్


కొండగట్టులో పూజలు చేస్తున్న ఎంపీ బండి సంజయ్

మల్యాల, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారనున్నాయని లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానంతో పాటు రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాలనూ బీజేపీ గెలుచుకుంటుందని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో చేపట్టిన ప్రజాహిత యాత్ర ప్రారంభానికి ముందు బండి సంజయ్ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. యాత్ర విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయన్నారు. తెలంగాణ ప్రజలు రాముని వారసులని రామున్ని నమ్ముకున్న పార్టీకే వాళ్లంత ఓట్లు వేస్తారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నింటా ప్రజలను మోసం చేయగా వారి పేరు చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం టైమ్ పాస్ చేయాలని చూస్తుందని సంజయ్ విమర్శించారు. బీజేపీ యాత్రలపై సంజయ్ మాట్లాడుతూ ప్రజాసమస్యలు తెలుసుకొని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడుతామన్నారు. అందుకే ఏడాది క్రితం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్రంలో 1600 కి.మీ మేర ప్రజా సంగ్రామ యాత్రను చేశానన్నారు. నిరుద్యోగ, రైతుల సమస్యల కోసం పోరాడినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజాహిత యాత్ర ద్వారా కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం మొత్తం ప్రధాని నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయడం కోసం ప్రజలను కోరనున్నట్లు వివరించారు. కరోనా సమయంలో ప్రపంచం అతలాకుతలం అయినప్పటికీ మన దేశం సుస్థిరంగా ఉండడం, ప్రజలందరికీ ఉచితం కోవిడ్ టీకాలను అందించిందని అలాగే వివిధ దేశాలకు సరఫరా చేసిందని అన్నారు.

● దేవుళ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం శఠగోపం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ దేవుళ్లతో పాటు దేవుళ్లను నమ్ముకున్న భక్తులను కూడా మోసం చేశాడని బండి సంజయ్ ఆరోపించారు. వేములవాడకు రూ.500 కోట్లు, కొండగట్టుకు రూ.100 కోట్లు అని వాటిని ఇవ్వకుండా ఆయా దేవుళ్లకు శఠగోపం పెట్టారని విమర్శించారు. తాను ప్రసాద్ పథకంలో వేములవాడ, కొండగట్టులను చేర్చడానికి చర్యలు తీసుకుంటే బీజేపీకి పేరు వస్తుందనే నెపంతో బీఆర్ ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఆయన వెంట నాయకులు బింగి వేణు, నేరెళ్ల శ్రావణ్, వెంకటస్వామి, జనగాం రాములు, కొక్కెర మల్లేశం యాదవ్, కెల్లెటి రమేష్, సామ మహిపాల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు


భీమారంలో స్థానికులతో మాట్లాడుతున్న బండి సంజయ్

● మోదీ గెలిస్తే రామరాజ్యం..

మేడిపల్లి: మోడీ మళ్లీ గెలిస్తే రామరాజ్యం వసుందని.. కాంగ్రెస్ గెలిస్తే ఇటలీ అవుతుందని ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాహిత యాత్రను శనివారం మేడిపల్లిలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశ ప్రజలు కలలో కూడా ఊహించని విధంగా అయోధ్యలో రాముడి గుడి నిర్మించామన్నారు. రామ భక్తులు రాముడిని నమ్మే పార్టీకే ఓటువేయాలని కోరారు. రాముడి అక్షింతలను రేషన్ బియ్యం అన్న కాంగ్రెస్ వాళ్లు పీవీ నర్సింహరావుకు భారత రత్న ప్రకటిస్తే కనీసం అసెంబ్లీలో కృతజ్ఞత తీర్మానం చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే ఐదు లక్షల కోట్ల రూపాయలు కావాలన్నారు. కానీ బడ్జెట్‌లో 53 వేల కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ గల్లంతు అవుతుందని జోస్యం చెప్పారు. తనకు హాని చేయాలని తాంత్రిక పూజలు చేసిన నాయకుడు కేసీఆర్ అని, ఎదుటి వారి నాశనం కోరేవారు తమకి తామే పతనం అవుతారన్నారు. ప్రజా సేవ కోసం నిరంతరం పనిచేస్తూ ప్రజాసమస్యలపై ప్రజా సంగ్రామ యాత్ర చేస్తే కేసీఆర్ తనపై 100 పైగా కేసులు పెట్టి రెండు సార్లు జైలులో వేయించాడని అవేదన వ్యక్తం చేశారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి 590 కోట్ల 91 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ప్రజాహిత యాత్ర మేడిపల్లితో పాటు కొండాపూర్, మీదుగా బీమారం మండలానికి చేరుకుంది.అయన వెంట చెన్నమనేని డా. వికాస్‌రావు, జిల్లా అధ్యక్షుడు సత్యానారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పార్లమెంటు కన్వీనర్ ప్రవీన్‌రావు, కో కన్వీనర్ ధశరథరెడ్డి, మండల అధ్యక్షులు ముంజ శ్రీనివాస్‌గౌడ్, అన్నడి జలపతిరెడ్డి, జగన్‌రెడ్డి, నారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ధర్మరెడ్డి, రాజు, మధు, గణేష్, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుందని ఎంపీ బండి సంజయ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం రాత్రి ప్రజాహిత యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలం లోని ఊరూరా తిరుగుతూ గడప గడపకు తిరిగి మోదీ ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు, పిల్లలతో సెల్ఫీలు దిగుతూ, వృద్ధులను పలుకరిస్తూ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని బొమ్మెన, తక్కళ్ళపల్లి, సిరికొండ గ్రామాల్లో ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత పాదయాత్ర నిర్వహించారు. వీధుల వెంట తిరుగుతూ చిన్నారులు, మహిళలు, వృద్ధులకు కరచాలనం చేశారు. స్థానికంగా ఉన్న అంబేద్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. రాత్రి మండలంలోని సిరికొండలో బస చేశారు. నియోజకవర్గ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, పిడుగు ఆనందరెడ్డి, పిడుగు ప్రతాప్, కొనైడ్డి జలంధర్‌రెడ్డి, బద్రి సత్యం, ఎడ్మల వినోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

30క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

హుజూరాబాద్, ఫిబ్రవరి 10: పేదలకు బియ్యం పంచాల్సిన రేషన్ డీలరే బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి తెలి పారు. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సహన సుల్తానా ఆమె భర్త రహీం సహకారంతో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కామారెడ్డికి చెందిన బ్రోకర్‌కు విక్రయించేందుకు కరీంనగర్‌కు చెందిన రేవెల్లి అనిల్‌కుమార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. మహేంద్ర ట్రాలీ వాహనం ద్వారా డ్రైవర్ రేవెల్లి జంపయ్యకు అప్పగించగా అప్పటికే మాటు వేసి రాజపల్లి గ్రామం వద్ద ఉన్న ఎస్ఐ సాంబయ్యగౌడ్‌కు అనుమానం వచ్చి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారన్నారు. దానిలో పైన ఖాళీగా అన్ని సంచులు లోపల రేషన్ బియ్యం సంచులు పెట్టి తరలిస్తున్నట్లు గుర్తిం చారన్నారు. డ్రైవర్‌ను, వాహనం వెంట ఉన్న డీలర్ భర్త రహీముద్దీన్‌ను అదుపులోకి తీసుకొని విచారించామని చెప్పారు. కరీంనగర్‌కు చెందిన రేషన్ బియ్యం బ్రోకర్ రేవల్లి అనిల్ డీలర్ వద్ద 16 రూపాయలకు కొనుగోలు చేసి వాహనం ద్వారా సిరిసిల్ల మీదుగా కామారెడ్డికి తరలించి కిలోకు రూ. 21విక్రయిస్తున్నాడని తెలిపారు. ఇలా గత కొన్ని రోజులుగా రేషన్ బియ్యం దందా నడిపిస్తున్నట్లు నింధితులు పోలీసుల విచారణలో తెలిపారన్నారు. అనిల్‌కుమార్ కారులో ముందు వస్తు పోలీసుల తనిఖీలను పరిశీలి స్తున్నాడని చెప్పారు. వెనుక బియ్యం డ్రైవర్‌కు సమాచారం ఇస్తూ గుట్టు చప్పుడు కాకుండా తరలించి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పీడీఎస్ బియ్యం విక్రయించిన చెల్పూర్ రేషన్ డీలర్ సహన సుల్తానా, అందుకు సహకరించిన రహీం, ట్రాలీ డ్రైవర్ అనిల్‌కుమార్‌లతో పాటు మరో ముగ్గురు రేషన్ బియ్యం బ్రోకర్లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి సెల్‌ఫోన్, రూ. 10వేల నగదు, మహేంద్ర ట్రాలీ వాహనాన్ని సీజ్ చేశామన్నారు. రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఎస్సై సాంబయ్య, సిబ్బంది అవినాష్, కుమార్, మొండయ్యను ఏసీపీ అభి నందించారు. సమావేశంలో టౌన్ ఇన్‌చార్జీ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై సాంబయ్య పాల్గొన్నారు.

సింగరేణి పీఆర్‌వోకు జర్నలిజంలో డాక్టరేట్

కరీంనగర్ (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/గోదావరిఖని, ఫిబ్రవరి 10: సింగరేణిలో పీఆర్‌వో పనిచేస్తున్న శ్రీరాముల శ్రీకాంత్‌కు జర్నలిజంలో డాక్టరేట్ లభించింది. నిజామాబాద్‌లో తెలంగాణ విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్‌ను ప్రకటించింది. రోల్ ఆఫ్ సోషల్ మీడియా ఇన్ సోషల్ అండ్ పొలిటికల్ మూమెంట్స్ ఏ కేస్ స్టడీ ఆఫ్ తెలంగాణ మూమెంట్ అన్న అంశంపై ఇఫ్లూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం పర్యవేక్షణలో శ్రీకాంత్ పరిశోధన చేశారు. సామాజిక, రాజకీయ ఉద్య మాల్లో సోషల్ మీడియా బలమైన పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలోని సోషల్ మీడియా పాత్ర ఎక్కువ ఉందనే విషయాన్ని తన పరిశోధన పత్రంలో సమర్పించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కాపువాడకు చెందిన శ్రీకాంత్ ఎంఎస్‌సీ(ఎలక్ట్రానిక్స్), ఎంబీఏ, ఎంసీజే, ఎంఎస్‌డబ్ల్యూ పూర్తి చేశాడు. ఎనిమిదేళ్లుగా సింగరేణి కాలరీస్‌లో వెల్ఫేర్ ఆఫీసర్‌గా, పర్సనల్ అధికారిగా పనిచేస్తున్న శ్రీకాంత్ ప్రజాసంబంధాల అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జీఎం కోఆర్డినేషన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సురేష్, తదితరులు శ్రీకాంత్‌ను అభినందించారు.


శ్రీకాంత్‌ను అభినందిస్తున్న చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్

ఏటీఎంను కొల్లగొట్టిన దుండగులు

- రూ.27.75లక్షల నగదు అపహరణ
- మరో ఏటీఎంలో చోరీకి యత్నం
- సెక్యూరిటీ అలర్ట్ సమాచారం ఇవ్వడంలో జాప్యం
- రంగంలోకి పోలీస్ బృందాలు


సీసీ కెమెరాకు స్ప్రేస్ప్రే చేస్తున్న దుండగుడు, ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో తొలగింపు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 10: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి తరువాత ఏటీఎం దోపిడీ దొంగలు తెగబడ్డారు. రెండు ఏటీఎంలలో చోరీకి యత్నించారు. ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని హనుమాన్ దేవాలయం పక్కన ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసి 27.75లక్షల నగదును ఎత్తుకెళ్లారు. గోదావరిఖని గంగానగర్‌లోని రాజీవ్ రహదారి పక్కన ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించి విఫలమయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి 1.30గంటలకు రాజీవ్ రహదారి పక్కన గంగానగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలోకి మంకీ క్యాప్ ధరించి స్ప్రేస్ప్రే, కట్టర్‌లతో చొరబడిన దొంగలు సీసీ కెమెరాలకు స్ప్రేస్ప్రే చేశారు. అనంతరం ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా వాహనాల కదలికలు ఉండడంతో విరమించుకున్నారు. అర్ధగంట వ్యవధిలో ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలోకి చొరబడిన దొంగలు సీసీ కెమెరాలకు స్ప్రేస్ప్రే చేసి ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేశారు.అందులో ఉన్న రూ.27.75లక్షలను ఎత్తుకెళ్లారు. ఏటీఎం సెక్యూరిటీ అలర్ట్ సిస్టం కు సమాచారం వెళ్లింది. ముంబైలో ఉన్న ఈ సెక్యూరిటీ అలర్ట్ విభాగం దోపిడీ జరిగిన గంట తరువాత రామగుండం పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. శనివారం తెల్లవారుజా మున 3గంటలకు గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ జీవన్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీ, ఇతర వివరాలను సేకరించారు.

● రెక్కీతోనే చోరీ..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏటీఎంను కొల్లగొట్టిన ముఠా రెక్కీతోనే చోరీకి పాల్పడినట్టు తెలుస్తుంది. ఏటీఎంలలో పలు ప్రైవేట్ సంస్థలు నగదు నింపే కాంట్రాక్టు తీసుకున్నాయి. హిటాచి సంస్థ బసంత్‌నగర్‌లోని ఎస్‌బీఐ చెస్ట్ బ్యాంకు నుంచి శుక్రవారం రూ.30లక్షలు తీసుకువచ్చి గౌతమినగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో లోడ్ చేసింది. సాధారణంగా సాయంత్రం పూట సంబంధిత ఏజెన్సీలు ఏటీఎంలలో నగదు పెడతాయి. బ్యాంకుల సమయం వరకు ప్రజలు తమ అవసరం మేరకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లో చోరీకి పాల్పడిన ముఠా గతంలో ఈ తరహా చోరీలకుపాల్పడిన ముఠాగా అనుమానిస్తున్నారు. గంగానగర్‌లో ఏటీఎం రాజీవ్ రహదారి పక్కన ఉండడం, వాహనాలు, జనం కదలికలు ఉండడంతో దాన్ని విర మించుకున్నారు. తరువాత అర్ధగంట వ్యవధిలో గౌతమినగర్‌లో ఘటనకు పాల్పడ్డారు. వీరు వాహనంలో వచ్చినట్టు భావిస్తున్నారు. ఒక కారు గౌత మినగర్ రోడ్డు పక్కనే నిలిపి ఉండడం, వాహనాలు వచ్చే సమయంలో పార్కింగ్ లైట్లు వేసినట్టు గుర్తించారు. ఘటన జరిగిన కొద్ది సమయం ముందు పోలీస్ పెట్రోలింగ్ వాహనం అక్కడి నుంచి వెళ్లినట్టు తెలుస్తుంది.

● సెక్యూరిటీ లేదు.. అలర్ట్ సిస్టమూ లేదు..

గతంలో ఏటీఎంలలో ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని నియమించే వారు. ఇప్పుడు సెక్యూరిటీ సేవలను నిలిపివేశారు. దీనికి తోడు ఎక్కడైనా ఏటీఎంలు ధ్వంసం చేసినా, చోరీ చేసినా ముంబైలోని సెక్యూరిటీ అలర్ట్ విభాగానికి సమాచారం వెళుతుంది. క్షణాల్లో సంబంధిత పరిధిలోకి వచ్చే పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. శనివారం తెల్లవారుజామున గౌతమినగర్‌లో ఏటీఎం చోరీ ఘటన తరువాత గంటసేపటికి కానీ పోలీసులకు సమాచారం అందలేదు. దీంతో నిందితులను పట్టుకోలేకపోయారు. ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా టీములు నిందితుల కోసం గాలిస్తున్నాయి. ఏటీఎంలో డబ్బులు లోడ్ చేసే హిటాచి సంస్థ ప్రతినిధి రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చలి బోనాలు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 10: జిల్లా కేంద్రంలో శనివారం భక్తులు పోచమ్మ తల్లికి చలి బోనాలు సమర్పించే కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిలుకవాడలో ఉన్న పోచమ్మ తల్లి ఆలయం వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకుడు సంకోజి లింగమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

బైపాస్ బాధితులను ఆదుకోవాలి



బండి సంజయ్‌తో బాధిత రైతులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 10: మండలంలోని బండలింగాపూర్, వెల్లుల్ల, మేడిపల్లి, చౌలమద్ది గ్రామాల మీదుగా 63వ జాతీయ రహదారి నిర్మాణం చేపట్టుతున్న దానిలో విలువైన భూములను కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను బాధితులు కోరారు. శనివారం కొండగట్టులో పూజలు చేస్తునన సమయంలో బాధిత రైతులు కలిసి వారి సమస్యలను తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను బైపాస్ కోసం తీసుకుంటే జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేసారు. బైపాస్ రోడ్డుకు నిర్మాణానికి విలువైన వ్యవసాయ భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోతామన్నారు. బైపాస్ నిర్మాణం ఆకృతిని మార్చాలని, లేకుంటే భూమికి సరియైన పరిహారం ఇప్పించాలని బండి సంజయ్‌ను కోరారు. దీంతో ఎంపీ సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, బాధితులు పాల్గొన్నారు.

రేపు గద్దర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కథలాపూర్, ఫిబ్రవరి 10: మండలంలోని భూషణరావుపేటలో ఈ నెల 12న ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నట్టు రాష్ట్ర సామాజిక తెలంగాణ ధూంధాం కన్వీనర్ మారంపల్లి రవీందర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగుజీవుల్లో చైతన్యం తెచ్చేందుకు గద్దర్ రాసిన పాటలు ఎంతగానో ప్రాచుర్యం పొందాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ప్రవేశ పెడుతూ తీసుకున్న నిర్ణయం సముచితమని చెప్పారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడంపై రాష్ట్రంలోని కవులు, కళాకారుల తరఫున అభినందనలు తెలిపారు. భూమిపూజ కార్యక్రమానికి ధూంధాం రూపశిల్పి అంతడుపుల నాగరాజు సహా కవులు, కళాకారులు, మేధావులు హాజరవుతారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ జిల్లా కన్వీనర్ బత్తుల నరేశ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కాశవత్తుల లక్ష్మీరాజం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్, బెజగం గంగాధర్, మారంపల్లి శ్రీధర్, వెంకట్, హరీష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 10 : గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో మంజూరైన ఈజీఎస్ రూ. 3లక్షలు నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి అధికారులు, నాయకులతో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గం ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామ ప్రత్యేకాధికారి మిషన్ భగీరథ ఏఈ రాజు, కార్యదర్శి ప్రశాంత్‌లను శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, బోగ గంగాధర్, జవిడి రవి, డబ్బా రాజారెడ్డి, కోరం నవీన్, వెంకటేష్, బండి ప్రశాంత్, అంజిరెడ్డి, రాజు, తదితరలు పాల్గొన్నారు.

మహిళా రైతు పుస్తెలతాడు అపహరణ

మల్లాపూర్, ఫిబ్రవరి 10: మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన సకినపెల్లి రాజు అనే మహిళా రైతు మెడలోంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును శనివారం చైన్‌స్నాచర్లు ఎత్తుకెళ్లారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సకినపెల్లి రాజు అనే మహిళ రైతు గ్రామ శివారులోని పొలం పనులకని ఒంటరిగా రోజు మాదిరిగానే బయలుదేరింది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు గుర్తు తెలియని దుండగులు వచ్చి గ్రామ వివరాలను అడినట్లు మాటమాట కలిపి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పరారయ్యారన్నారు. అటు వైపు వచ్చిన స్థానికులకు తెలుపగా వారు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బాధితురాలి నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థినిని చితకబాదిన ఉపాధ్యాయురాలు

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని లక్ష్మీపూర్‌లో గల మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల హాస్టల్ లో జగిత్యాల పట్టణానికి చెందిన మైత్రి అనే 7 తరగతి చదువుచున్న విద్యార్థినిని సౌమ్య అనే ఉపాధ్యాయురాలు చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం విద్యార్థిని మైత్రికి ఆరోగ్యం సహకరించకపోవడంతో హాస్టల్‌లో వండిన వంట తినేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో ఎందుకు తినడం లేదంటూ మైత్రిని ఉపాధ్యాయురాలు గట్టిగా మందలించడమే కాకుండా చితకబాదినట్లు మైత్రి తల్లితండ్రులు ఆరోపించారు. దీనిపై తల్లిదండ్రులు శనివారం హాస్టల్‌కు వెళ్లి ప్రిన్సిపల్ సమక్షంలో విచారణ జరుపగా విద్యార్థిని తల్లిదండ్రులకు జరిగిన సంఘటనపై ఉపాధ్యాయురాలు క్షమాపణ చెప్పినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే వార్తసేకరణకు వెళ్లిన మీడియాపై హాస్టల్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించినట్లు పలువురు ఆరోపించారు.

సంగెంలో బావబావమరిది మధ్య గొడవ

- బావమరిదిపై కత్తితో దాడి

కోరుట్ల ఫిబ్రవరి 10: కుళాయి ఏర్పాటు కోసం ఏర్పాటు చేసుకుంటుండంగా వరసకు బావబావమరదుల మధ్య గొడవ కత్తితో దాడికి దారితీసింది. మండలంలోని సంగెం గ్రామంలోని ఓడ్డెర కాలనీలో శనివారం సాయంత్రం సమయంలో గోడవ చోటు చోటు చేసుకుంది. కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన అల్లెపు శ్రీనివాస్, సూర వెంకటీ బావబావమరుదులు. బావమరిది అల్లెపు శ్రీనివాస్ తన ఇంటికి నీటి సరఫరా కోసం మిషన్ భగరథ నుంచి పైపులైన్ ఏర్పాటు చేసుకోవడానికి జేసీబీ సహాయంతో బావ వెంకటి ఇంటి ముందు నుంచి గోతి తీస్తుండంగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గోడవ తీవ్రంకావడంతో వెంకటి అక్కడే ఉన్న కత్తితో శ్రీనువాస్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కాగా గమనించిన స్థానికులు 108 సిబ్బందితో పాటు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని కోరుట్ల పోలీసులు పరిశీలించారు. కాగా శ్రీనివాస్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల అసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 10: తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న దక్కడంపై భారత సురక్షా సమితి బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద పీవీకి పురస్కారం అందించడంపై ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీకి భారతరత్న దక్కడం తెలంగాణకు దక్కిన గౌరవం అన్నారు. పీవీని కాంగ్రెస్ విస్మరిస్తే, రాజకీయాలకు అతీతంగా దేశానికి పీవీ చేసిన సేవలను గుర్తించి దేశ అత్యున్నత పురస్కారం అందించిన మోదీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భారత సురక్షా సమితి బాధ్యులు ఏసీఎస్ రాజు, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, నారెందుల శ్రీనివాస్, వేముల పోచమల్లు, ఎడ్మల వెంకన్న, గాదాసు భూమన్న, కొత్తకొండ బాలన్న, బొందుకూరి శ్రీనివాస్, బోగ దేవన్న, సంపత్‌రావు, సతీష్ తదితరులు ఉన్నారు.

వస్తుందో..రాదో..



- ఉచిత విద్యుత్...వంట గ్యాస్‌పై ఆందోళన
- ఆరు గ్యారెంటీల దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- అధికారుల సర్వేతో అంతటా ఇదే చర్చ
- గ్యారెంటీకి రేషన్ కార్డు అర్హత తప్పనిసరి
- కార్డు లేని కుటుంబాల పరిస్థితి సందిగ్ధం

15వ తేదీ వరకు సర్వే పూర్తిచేసేందుకు చర్యలు

జగిత్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఉచిత విద్యుత్.. 500 రూపాయలకే సిలెండర్ తమకు వస్తుందో...రాదో అన్న ఆందోళన పలువురు దరఖాస్తుదారుల్లో నెలకొంది. ప్రభుత్వం అమలు చేయనున్న గ్యారంటీ పథకాలన్నింటికీ తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా చేయడం ఇందుకు కారణంగా మారుతోంది. తాజాగా ఉచిత విద్యుత్, రూ. 500 వంట గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారుల ఎంపికకు అధికారులు కసరత్తు ముమ్మురం చేశారు. ఈ నేపథ్యంలో ఈ రెండు గ్యారంటీలపై చర్చలు మొదలయ్యాయి. వీటికోసం దరఖాస్తు చేసుకున్న వారంతా తమకు పథకం వర్తిస్తుందా.. లేదా అని ఆరా తీస్తున్నారు. కొందరు ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నారు. మరి కొందరు తెలిసిన వారి ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ పథకం ఇళ్ల ఓనర్లు, అద్దెకున్న వారికి ఎలా ఇస్తారో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

ఈ పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఇటీవల ఉచిత విద్యుత్ కోసం ఇంటింటికి వెళ్లి ఆధార్ కార్డుతో పాటు రేషన్‌కార్డు నంబర్ తప్పనిసరిగా సేకరించడం ఇందుకు బలం చేకూర్చుతోంది. అదే విధంగా త్వరలో గ్యాస్ సిలిండర్ల కోసం కూడా రేషన్‌కార్డు నంబర్ స్వీకరించనున్నారు. రేషన్‌కార్డులు లేని కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మరో వైపు ఇతర జిల్లాలో రేషన్‌కార్డులు కలిగి అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న కుటుంబాలపై కూడా స్పష్టత కరువైంది.

● ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఆహార భద్రత (రేషన్ కార్డు) కలిగిన కుటుంబాలు 3,10,545 వరకు ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సరిహద్దు జిల్లాల నుంచి వచ్చి జిల్లాలో నివాసం ఉంటున్న మరో సుమారు 40 వేల వరకు కుటుంబాలు ఉన్నాయి. జగిత్యాల పరిధిలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో సుమారు 1,49,783 దరఖాస్తుల వచ్చాయి. వాస్తవంగా పదేళ్లలో కేవలం కొద్ది సంఖ్యలో మాత్రమే కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. పెళ్లిలతో కొత్తగా ఏర్పాటైనా చాలా కుటుంబాలకు రేషన్ కార్డులు లేవు. అలాంటి కుటుంబాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో చాలా ఉన్నాయి. అందులో సగం కుటుంబాల వరకు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది.


● ప్రజాపాలన దరఖాస్తులు 3,24,532

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 3,24,532 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఇందులో గ్రామాల్లో 2,49,279 దరఖాస్తులు, మున్సిపాలిటీల్లో 75,253 దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా మొత్తంమ్మీద సుమారు మూడున్నర లక్షల పైగానే కుటుంబాలు ఉన్నట్లు అంచనా. విద్యుత్ కనెక్షన్లు 4,95,973 ఉన్నాయి. ఇందులో గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్ కనెక్షన్లు 3,17,863 వరకు ఉన్నాయి. వంట గ్యాస్ కనెక్షన్లు సుమారు 2,54,792 వరకు ఆయిల్ కంపెనీల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం కుటుంబాల్లో ఆదాయ వర్గాలకు సంబంధించిన సుమారు లక్ష మినహా మిగిలిన సుమారు రెండున్నర లక్షల కుటుంబాలు పేద, మధ్యతరగతి వర్గాలు ఉన్నట్లు సమాచారం.

● యాప్ పనితీరు ఇలా...

టీఎస్ ఎన్‌పీడీసీఎల్ రూపొందించిన యాప్‌లో ఎంప్లాయి ఐడీ ఎంటర్ చేసి, వారికి అందించిన పాస్ వర్డ్ ద్వారా యాప్‌ను ఓపెన్ చేసుకోవాలి. అనంతరం పాస్ వర్డ్ ద్వారా యాప్‌ను ఓపెన్ చేసుకోవాలి. అనంతరం గృహజ్యోతి ఇన్‌ఫర్‌మేషన్ అనే ఆప్షన్‌ను ఎంచుకుంటారు. ఎంప్లాయి రిజిస్టర్ మొబైల్ ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని వేరిఫై చేసుకున్న తదుపరి ఎంప్లాయికి కేటాయించిన మీటర్ల వివరాలు పూర్తి పేర్లతో కనిపిస్తాయి.

ముందుగా మీటరు నంబరును ఎంటర్ చేసి, ప్రజాపాలనతో దరఖాస్తు చేసుకున్న రశీదు నంబరును నమోదు చేయాలి. నంబర్ లేకపోతే నాట్ పర్మిష్డ్ అని సెలక్ట్ చేయాలి. అనంతరం ఆధార్, రేషన్ కార్డు నంబర్, ఫోన్ నంబర్లను సెలక్ట్ చేయాలి. ఆ నంబర్లు లేకపోయిన నాట్ పర్మిష్డ్ అని సెలెక్ట్ చేసి సబ్ చేయాల్సి ఉంటుంది.



● రేషన్ కార్డు లేక ఇక్కట్లు...

జిల్లాలో సుమారు పది సం వత్సరాలుగా పేదలకు నూతనంగా రేషన్ కార్డులు జారీ చేయలేదు. నూతనంగా రాష్ట్రంలో అధికారం చేప ట్టిన కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇస్తుందనే నమ్మకంతో ప్రజలున్నారు. అయితే ప్రజాపాలన పేరిట ఆరు గ్యారెంటీల కోసం తీసుకున్న దరఖాస్తులతో సైతం రేషన్ కార్డు లేని వారు దరఖాస్తు చేయాలని సూచించారు. కానీ కొత్త కార్డుల లబ్ధిదారులను ఎంపిక చేయకుండానే ఇతర పథకాల అమలుకు ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. దీంతో రేషన్ కార్డులు లేని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ పథకానికి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటుండడంతో పదేళ్లుగా కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారి పరిస్థితి ఏమిటో తెలియక తికమక పడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రూ. 500 వంట గ్యాస్ వంటి పథకాలకు అర్హులుగా ఉండమేమో అన్న ఆందోళనకు గురవుతున్నారు. రేషన్ కార్డులు జారీ చేసిన అనంతరం ప్రభుత్వం గ్యారెంటీ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టాలన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

కువైట్ కాంగ్రెస్ నాయకురాలికి అభినందన

జగిత్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రవాస భారతీయుల విభాగం కువైట్ కోకన్వీనర్‌గా ఇటీవల నియమితులైన చొప్పల కల్యాణిని శనివారం తెలంగాణ గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డిల అభినందించారు. హైద్రాబాద్‌లో కల్యాణిని కలిసి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రచురించిన వలస కార్మికుల హక్కుల పుస్తకాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు కట్టుబడి ఉందన్నారు. భారత ప్రభుత్వం ప్రవాసీ భారతీయ బీమా యోజన కింద రూ. 10 లక్షల ప్రమాద బీమా పథకంలో సహజ మరణాన్ని సైతం చేర్చాలన్నారు.

చిన్నారిని ఆదుకోవాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి 10: గుండెకు రంధ్రం పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన చిలువేరి నరేష్‌శరణ్య దంపతుల నాలుగు నెలల చిన్నారి దన్విక‌కు దాతలు ఆర్థిక సహాయం చేసి ప్రాణ భిక్ష పెట్టాలని మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ కోరారు. శనివారం సాయంత్రం చిన్నారి తల్లిదండ్రులకు మాజీ ఎమ్మెల్యే 40 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారి చికిత్స కు సుమారు 10 లక్షల రూపాయల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, కొడిమ్యాల సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సింగరావు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ ఉన్నారు.

నియామకం

గొల్లపల్లి, ఫిబ్రవరి 10: మండల కేంద్రానికి చెందిన చెవులమద్ది మల్లేష్ తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఐలయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి నరసాపురం రవీందర్ శనివారం మల్లేష్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

మెట్‌పల్లి, ఫిబ్రవరి 10: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుల్లో రాణించాలని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మెట్‌పల్లి పట్టణంలోని నరేంద్ర జూనియర్ కళాశాల వీడ్కోలు కార్యక్రమాన్ని ఓ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులు నిర్వహించగా ఎస్సై చిరంజీవితో కలిసి ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు ఆటపాటలతో పాటు నృత్యాలు పలువురిని ఆకర్షింపజేశాయి. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రావు, డైరెక్టర్ అంజయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రూప్-4 ఫలితాల్లో ప్రతిభ

ధర్మపురి, ఫిబ్రవరి 10: టీఎస్‌పీఎస్సీ శుక్రవారం రాత్రి ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో మండలానికి చెందిన ముగ్గురు సత్తా చాటారు. తుమ్మెనాలకు చెందిన వెలుముల మధుకర్‌కు 849, దమ్మన్నపేటకు చెందిన మైదం ప్రశాంత్‌కు 935, పట్టణానికి చెందిన ఆకుల దినేష్‌కు 1172వ ర్యాంక్ వచ్చింది.

డీఏ, పీఆర్‌సీ బకాయిలను వెంటనే మంజూరు చేయాలి



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న యూటీఎఫ్ బాధ్యులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 10: డీఏ, పీఆర్‌సీ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ జిల్లా బాధ్యులు తిరుక్కోవెల శ్యాంసుందర్, అంబటి భూమేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో శనివారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, బదిలీలు పదోన్నతులు చేపట్టాలని కోరారు. అలాగే ఉపాధ్యాయుల పనిభారం తగ్గిస్తూ కేర్‌టేకర్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ స్కూల్స్ ప్రధానకార్యదర్శి దగ్గు రాకేష్, కోశాధికారి కోమాకుల రాజు, కార్యదర్శులు రాడపాక జ్యోతి, సంయుక్త, రవీందర్, సంఘ అర్బన్ మండల అధ్యక్షుడు బల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థి కిడ్నాప్ కలకలం..

● ఘటన ఉత్తదేనన్న పోలీసులు



సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్న పోలీసులు

మల్యాల, ఫిబ్రవరి 10: మల్యాల మండల కేంద్రంలో శనివారం విద్యార్థి కిడ్నాప్ యత్నం కలకలం రేపింది. విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల బీసీ కాలనీకి చెందిన సోహెల్ అనే 7వ తరగతి విద్యార్థి శనివారం ఉదయం పాఠశాలకు నడుచుకుంటు వెలుతుండగా కొత్తపేట ప్రాంతంలో వెనుకాల నుంచి కారులో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తుల్లో ఇద్దరు కారు దిగి విద్యార్థిని అపహరించుకునేందుకు యత్నించారు. దీంతో బాలుడు వాళ్ల చేతిని కొరకడంతో పాటు గట్టిగా అరవడంతో వారు వచ్చిన కారులో పరారయ్యారు. వెంటనే తన బంధువుకు తెలపడంతో శంషోద్దీన్ అనే యువకుడు 100 కాల్ చేసి సమాచారం అందించాడు. దీంతో బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే ఆగంతకులు వెళ్లిపోయారు. అక్కడి స్థానికులను, విద్యార్థిని విచారించారు. తెల్ల రంగు కారులో నలుగురు వచ్చారని ఇద్దరు బయటకు దిగి తనను లాక్కెళ్లె ప్రయత్నం చేశారని విద్యార్థి పోలీసులకు తెలిపాడు. దీంతో రహదారి వెంట గల సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు తెలుపురంగు కార్ల వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం విద్యార్థి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై కుమారస్వామి సంఘటన స్థలం పరిశీలించారు.

● కిడ్నాప్ యత్నం వాస్తవం కాదు..

మల్యాలలో శనివారం విద్యార్థి అపహరణ యత్నంపై అతను పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడని ఎస్సై కుమారస్వామి తెలిపారు. విద్యార్థి కిడ్నాప్ విషయం వాస్తవం కాదని, తాము సంఘటన స్థలంలో విచారణ జరిపినట్లు పేర్కొన్నారు. సోహెల్ తరచూ పాఠశాలకు వెళ్లెందుకు సతాయించేవాడని అందులో భాగంగానే కిడ్నాప్ అని అన్నట్లు భావిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సీఐ సమక్షంలో విచారణ సందర్భంగా సీసీ కెమెరాల పుటేజీల పరిశీలన, విద్యార్థి ఇస్తున్న సమాచారానికి పొంతన లేదని అన్నారు. కిడ్నాపు యత్నం ఘటనల ప్రచారం వట్టిదేనని ఆ వదంతులను ప్రజలు నమ్మవద్దని, అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు గాని ఎస్సై, సీఐలకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

దేశవ్యాప్త గ్రామీణ బంద్ విజయవంతం చేయాలి



అభివాదం చేస్తున్న నాయకులు

కోరుట్ల ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న నిర్వహిస్తున్న దేశ వ్యాప్త గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని జూయింట్ వామపక్ష కార్మిక సంఘ నేతలు పిలుపు నిచ్చారు. శనివారం పట్టణంలోని సి ప్రభాకర్ భవనంలో జిల్లా వామపక్ష నేతలతో పాటు వివిధ కార్మిక సంఘ నేతలు గ్రామీణ బంద్ సంబంధించిన కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడారు. కార్మిక సంఘ నేతలు మాట్లాడారు. బ్రిటీష్ కాలం నుంచి పోరాటం చేసిన సాధించుకున్న 44 చట్టాలను నాలుగు విభాగాలుగా విభజించి పెట్టుబడిదారులకు అనుకూలంగా బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్ల క్రితం నుంచి ఆధికారంలోకి వచ్చి కార్మికులకు చేసింది ఏమీలేదన్నారు. విదేశాలలో ఉన్న నల్లధనం తిరిగి తేస్తామని మాయమాటలు చెప్పి దేశ ప్రజలను మోసం చేసిందని అన్నారు. కనీస వేతన జీవోలను సవరించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇప్పడి వరకు సవరించకపోవడం విడ్డూరమని అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ నెల 16న గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు టేకుమల్ల సమ్మయ్య, సుతారి రాములు, ఎండీ ముక్రరం, చౌదరి, జిందం ప్రసాద్, చింత భూమేశ్వర్, కొక్కుల శాంత, గాజంగి రాజేశం, గంగాధర్ పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటించడం గర్వకారణం

మెట్‌పల్లి, ఫిబ్రవరి 10: తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల సృష్టికర్త, బహుభాషా కోవిదుడు, మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ మాజీ ఛైర్మన్ పీవీ నరసింహారావుకి భారతరత్న పురస్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఎంతో గర్వకారమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఒక ప్రకటనలో అన్నారు.

పీవీ మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్‌కు 1967 నుంచి 1983 వరకు ఛైర్మన్‌గా ఎనలేని సేవలు అందించారన్నారు. పీవీ సేవలు గుర్తించి భారతరత్న ప్రకటించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థిని ఎంపిక



అల్లె హర్షిత

కోరుట్ల ఫిబ్రవరి 10: రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు కోరుట్ల పట్టణంలోని సిదార్థ పాఠశాలకు చెందిన విద్యార్థిని అల్లె హర్షిత ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలాజీ దామెదర్ శనివారం తెలిపారు. కోరుట్ల పట్టణానికి చెందిన అల్లె కావ్యశ్రీ-సతీష్ దంపతుల కూతురు పట్టణంలోని సిదార్థ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. వారం రోజుల క్రితం జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ సంద ర్భంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఫేయిర్ పెయింటింగ్ విభాగంలో హర్షిత గీసిన గుండెకు సంబధిం చిన పెయింటింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శన ఎంపిక అయినట్లు జిల్లా సైన్స్ అధికారి బాజోజీ శ్రీనివాస్ ప్రకటించినట్లు కరస్పాడెంట్ తెలిపారు. హర్షితను పాఠశాల కరస్పాడెంట్ బాలాజీ దామెదర్‌తో పాటు పట్టణ ప్రముఖులు అభినందించారు.

● ఉపన్యాస పోటీలకు..

రాయికల్: మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని బొడ్డుపల్లి రక్షిత రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు వి రమణి శనివారం తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీల్లో రక్షిత ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని రక్షితను, ఉపాధ్యాయుడు బొల్లె చిన్నయ్య, సైన్స్ ఉపాధ్యాయులు కలువకోట కార్తీక్, తోట శంకరయ్యలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, మహేష్, తిరుమల, గంగరాంజం, శ్రీనివాస్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులో మున్సిపల్ కార్యాలయానికి చెందిన చెత్తసేకరించే ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

- జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్‌లో పోలీస్ కళాబృందం మూఢనమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డుప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై సధాకర్, ఏఎస్సై, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం ఇటీవల ముగియడంతో మండలంలోని విట్టంపేట మాజీ సర్పంచ్ ఆకుల రాజారెడ్డిని గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

కొడిమ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా పైపులైన్ లీకేజీల మరమ్మతులు, గేట్‌వాల్‌ల పనితీరు, మురికి నీటి కాల్వల్లోని చెత్తను తొలిగించారు. ప్రత్యేక అధికారులు తహసీల్దార్ రవికాంత్, ఎంపీవో ప్రవీణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

- కొడిమ్యాల మండలంలోని దమ్మయ్యపేట గ్రామ మాజీ సర్పంచ్ తునికి నర్సయ్య తల్లి శనివారం అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో శ్రీరాజరాజేశ్వర వర్తక సంఘం అధ్యక్షుడిగా గంప వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కొత్త భాస్కరాచారి, ఉపాధ్యక్షులుగా పెద్ది రమేష్, కనపర్తి మనోహరాచారి, కోశాదికారి మాసూరి పార్థసారథి ఎన్నికయ్యారు.

రాయికల్: రామాజీపేట ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కండ్లపెల్లి నరేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కండ్లపెల్లి సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా మారంపెల్లి రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొబ్బల వేణు, జగిత్యాల డివిజన్ అధ్యక్షుడు నక్క సతీష్ మాదిగ హాజరయ్యారు.

- రాయికల్ మండలంలోని కుమ్మరిపెల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఎంపీటీసీ దొంతి నాగరాజు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఎస్ఎంసీ మాజీఛైర్మన్ ఒల్లెపురాజేందర్ పాల్గొన్నారు.

- రాయికల్ మండలంలోని రామాజీపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉత్తేజం పథకం కింద అల్పాహారం కోసం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త అయిలేని కృష్ణారెడ్డి శనివారం మూడు వేల విరాళం అందజేశారు.

మెట్‌పల్లి: మానవ సృష్టిలో తోటి మనిషికి సేవ చేయడం అంటే భగవంతునికి సేవ చేసినట్లేనని వైశ్యకుల గురువు హాల్దిపూర్ పీఠాధిపతి వామన ఆశ్రమ స్వామిజీ అన్నారు. కోటి పుష్పార్చనను 102 వాసవి దేవాల యాలలో చేపట్టే కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని వాసవి కనాకపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి, ఆర్యవైశ్య పట్టణాధ్యక్షుడు మైలారపు రాంబాబు, ఆలయం అధ్యక్షుడు చాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.